

# తోడొకరుండిన....

## - శారద పోలంరాజు



(గత సంచిక తరువాయి)

ఆ రాత్రి ముగ్గురికి నిద్ర కరువయింది. ఎక్సైట్‌మెంటో టెన్షనో ఆనందమో ఏదీ తెలియని కలగూరగంప వంటి భావనలు. ఆలోచనలు గతంలోకి ప్రయాణించాయి.

❀❀❀

తరుణి, పూర్ణిమ చిన్నపిల్లలగా వున్నప్పటి నుండే వాళ్ళ తల్లితండ్రులు ఒకటే కాలనీలో వుండేవాళ్ళు.

పూర్ణిమ నాన్నగారు సెక్రటేరియేట్లో ఆఫీసర్. వాళ్ళది పెద్ద కుటుంబం. అన్నదమ్ములు ముగ్గురు, వారి తల్లి పిల్లలతో ఒకటే సమిష్టి కుటుంబం. చాల స్నేహపాత్రులు. అన్నదమ్ములందరి సంతానంలోకి పూర్ణిమ పెద్దది. ఇంట్లో అత్తగారు జానకమ్మ అజమాయిషీలో కోడళ్ళు వంటిల్లు చూసుకొనే వారు.

పూర్ణిమ వయసుకు చిన్నదయినా తనకు తోచిన చిన్నచిన్న పనులలో పెద్దలకు చేదోడు వాదోడుగా వుండేది. చెల్లెళ్ళకు తలలు దువ్వి జడలు వేయటం, తమ్ముళ్ళకు షూస్ వేయటం వంటి పనులన్నీ ఒకరు చెప్పకుండానే చేయటం నేర్చుకున్నది. అట్లాగే స్కూల్ నుండి ఇంటికి వెళ్ళగానే తన హోంవర్క్ చేసుకుంటూనే తతిమ్మా వాళ్ళ హోంవర్క్ దగ్గరుండి చేయించేది. వాళ్ళకు కథలు చెప్పి పడుకోబెట్టే భాధ్యత కూడా నిర్వహించేది.

వాళ్ళ నాయనమ్మ జానకమ్మ కయితే ఆ పిల్లను చూస్తే ఎంతో మురిపం. "పిచ్చిపిల్ల. అభం శుభం ఎరుగదు. అయినా ఒకరు చెప్పాల్సిన పని లేకుండా ఎంత చక్కగా పని చక్కపెడుతున్నదో చూశావుటే." అంటూ చుట్టపు చూపుగా వచ్చిన కూతురితోనూ ఇతర బంధువులతోనూ చెప్పుకొని మురిసి పోయేది.

"ఆ. అదొక పెద్ద పనా అమ్మా? ఆడపిల్ల అన్న తరువాత ఆ మాత్రం పనులు చేయకపోతే ఎట్లా?". అంటూ సాగదీసేది ఆమె కూతురు అనసూయ.

ఆమె కూతురు కాంతం పూర్ణిమ వయస్సుదే. కాని కొరకరాని కొయ్య. ఒక్క పని కూడా అందుకునేది కాదు. చకచకా అన్నాల ముందర కంచాలు మంచినీళ్ళు సర్దటం భోజనాల తరువాత ఎంగిళ్ళు శుభ్రం చేయటం వంటి పనులు చేసే పూర్ణిమ అంటే అనసూయకు అసూయ.

"అయినా అన్నయ్య వంటి మధ్య తరగతి ఇళ్ళల్లో ఆడపిల్లలు ఆ మాత్రం పనులు నేర్చుకోక పోతే రేప్పొద్దున అత్తారిళ్ళల్లో ఇబ్బంది పడరుటే? నౌకర్లు చాకర్లు వున్న పెద్దింటి సంబంధాలు అన్నయ్య వల్ల ఏమౌతుంది?" అంటూ దీర్ఘాలు తీసేది.

"చాల్లేవే, నేర్చుకొని పోయావు. నీ కూతుర్ని చూడరాదూ!? గడకర్రలా పెరిగింది. కాని ఒక్క పని కూడా చేతకాదు. అటుపుల్ల తీసి ఇటు పెట్టనుకూడా ముందుకు రాదు. పోనీ చదువు చూద్దామా అంటే అది కూడా అబ్బలేదు. ఆమేన ఇంట్లో కూర్చొని తిని నవల్లు చదువుతూ పడిదొర్లటం తప్పిస్తే ఇంకోటి కనిపించటం లేదుకదా! అది కూడా రేప్పొద్దున పెళ్ళయి అత్తారింటికి వెళ్ళవలసిన పిల్లేగా?" అంటూ తల్లి మందలించేటప్పటికి ఆ కూతురు ముఖం మాడ్చుకొని,

"అయినా నా కూతురికి అత్తారింట్లో చాకిరీ చేయాల్సిన ఖర్మమేం పట్టలా. మా మేనల్లుడికే ఇద్దామనుకుంటున్నాం. వాళ్ళకు పది తరాలు కూర్చొని తిన్నా తరగని ఆస్తి వుంది తెలుసా?" అంటూ బీరాలు పోయేది.

"ఆ చాల్లే సంబడం. నిండా పన్నెండేళ్ళు కూడా లేని పిల్లకు ఎప్పుడో జరగబోయే పెళ్ళి గురించి ఇప్పటినుండే అటు చదువు లేక పనీ పాటలు నేర్పక ఎందుకూ పనికి రాని దానిలా తయారు చేయమాక. చక్కగా పూర్ణిమకు మల్లే చదువు పనిపాటలు నేర్పుతూ వుండు." అంటూ తల్లి చేసే నీతిబోధలకు ఆమె కూతురు మూతి ముడుచుకు కూర్చుంటే, వదినలు "మీ అమ్మే కదా వదినా. ఏదో చనువుగా అన్నంత మాత్రాన అంత కోపం తెచ్చుకొని అలిగి కూర్చోవాలా?" అంటూ అటు ఆడబడుచుకు, "ఆడపిల్లలకు ఒకరు నేర్పాల్సిన పనేముంది అత్తయ్యా! అవసరం వస్తే వాళ్ళే నీళ్ళల్లో చేపల్లాగా వాళ్ళే నేర్చేసుకుంటారు." అంటూ ఇటు అత్తగారికి నచ్చచెప్పి సాగదీసి అలుకలు తీర్చేవారు.

తరుణి ఇంటి వాతావరణం దీనికి పూర్తిగా భిన్నం. ఆమె తండ్రి ఒక బిజినెస్‌మాన్. ఆయనకు స్వంత వ్యాపారాలు వుండేవి. ఇంట్లో తల్లి తండ్రి ఒక్కగానొక్క కూతురు తరుణి వుంటారు. బంధుజనం కూడా తక్కువే.

ఇటువంటి వాతావరణంలో పెరిగిన తరుణికి ఎప్పుడూ వచ్చేపోయే చుట్టాలతో కళకళ్ళాడుతూ వుండే పూర్ణిమ ఇల్లంటే ఎంతో ఇష్టం. ఎక్కువ సమయం పూర్ణిమ ఇంట్లోనే గడపటానికి ఇష్టపడేది. రెండు ఫామిలీలు ఎంతో సన్నిహితంగా వుండేవి. అట్లాగే పిల్లలు కూడా చిన్నతనం నుండే కలిసి ఆడుకునేవారు.

మొదట్లో రెండు ఇళ్ళ మధ్య కాంపౌండ్ వాల్ వుండేది. కాలక్రమేణా కుటుంబాలు సన్నిహితమవటం పిల్లలందరూ ఒక్క చోటే చేరి ఆడుకోవటంతో ఆ గోడ తీసేసి ఒక బాడ్మింటన్ కోర్ట్ ఏర్పాటు చేసారు.

ఇంక ఆ ఇంటి నుండి ఈ ఇంటికి చుట్టూ తిరిగి వెళ్ళవలసిన శ్రమ లేకుండా ఇంట్లోనే ఇల్లులాగా అయిపోవటాన అందరికి ఇంకా ఫ్రీ. ఎప్పుడు ఎవరు ఎక్కడ వుంటారో తెలిసేది కాదు.

కొత్తల్లో పిల్లలందరిని చుట్టూ కూర్చో పెట్టుకొని జానకమ్మ కథలు చెప్పుతూ అన్నం కలిపి ముద్దలు పెట్టటం తరుణి ఎంతో ఆనందంగా చూసేది. మధ్యాహ్నాలు ఆవిడ ఒక బేసిన్ వంటి గిన్నెలో అన్నం పెట్టుకొని ఇంత ఆవకాయనో చింతకాయ పచ్చడో వేసి నెయ్యి పోసి కలిపి పెద్ద బత్తాయిపండంత ముద్దలు ఒక్కొక్కరి చేతిలో పెట్టటం, వాళ్ళు ఆ ముద్ద కొంచంకొంచంగా కొరుక్కు తినటం. అట్లా అందరి చేతిల్లో పెట్టి మళ్ళీమొదటి పిల్ల వద్దకు వచ్చేటప్పటికి చేయి ఖాళీ అవగానే ఇంకో ముద్ద పెట్టటం చేస్తూ వుండటంతో పిల్లలు తాము కలుపుకు తినేదానికన్నా కూడా రెండు ముద్దలు ఎక్కువగానే తినేవారు.

తరుణి కూడా వుంటే, "రావే అమ్మడూ, నువ్వు కూడా ఒక ముద్ద తిందువుకాని," అంటూ జానకమ్మ పిలవగానే ఆమె కూడా ఆ పిల్లల గుంపులో కలిసి నాయనమ్మ చెప్పే కథలు వింటూ ముద్దలు తినేది.

ఇంటికి వెళ్ళిం తరువాత తల్లి ఏదైనా తినటానికి ఇచ్చినప్పుడు, "అమ్మా, నాయనమ్మ ముద్దలు పెడితే తిన్నాను ఆకలి లేదు." అనేటప్పటికి మొదట్లో తల్లి మొహమాట పడినా క్రమేపి అలవాటయింది.

ఆవిడ కూడా ఆ సమయంలో జానకమ్మ చెప్పేకథలు వింటూ తతిమ్మా తోడికోడళ్ళతో కాలక్షేపం చేసేది. ఆ విధంగా రెండు కుటుంబాలకు గట్టి అనుబంధం ఏర్పడ్డది. వాళ్ళ అనుబంధం యాభై ఏళ్ళనాటిది అన్నమాట.

వారు అయిదవ తరగతిలో వుండగా అదే క్లాసులో చేరింది రేణుక.

స్కూలుకు వచ్చిన మొదటి రోజున చాల బెరుగ్గా వుంది. బాగా గారాబంగా పెరిగిందవటాన కొత్త స్కూల్లోకి బెరుకు బెరుగ్గా కాలు పెట్టింది. క్లాస్ టీచర్ ఆ పాపను తరుణి పూర్ణిమల మధ్య కూర్చో పెట్టింది. అది చూసిన ఆ ఫ్రెండ్స్ ముఖం చిట్లించారు. తమ మధ్య మూడో

వ్యక్తి రావటం కాస్త కంటకింపుగా అనిపించింది. మూతులు ముడుచుకుని కూర్చున్న వాళ్ళ మధ్య రేణుకకు ఇంకా బెదురుగా అనిపించింది.

కొత్తగా స్కూల్లో చేరటాన ఇంకా యూనిఫాం కుట్టించుకోలేదు. తెల్లగా పెద్దపెద్ద కళ్ళతో, బాబ్డ్ కట్ చేసిన జుట్టు, ఫ్రిల్డ్ ఫ్రాక్. మొత్తానికి భలే ముద్దుగా వుంది.

అందరూ లంచ్ టైంలో అన్నాలు తినటానికి వెళ్ళిపోయినారు. రేణుకకు అంతా కొత్తగా అనిపించి క్లాసు రూంలోనే ఒంటరిగా కూర్చుండిపోయింది. తెచ్చుకున్న లంచ్ బాక్స్ కూడా తెరవలేదు. ఆకలి దంచేస్తోంది. ఏడుపు వస్తోంది.

లంచ్ ముగించుకున్న తరుణి పూర్ణిమ క్లాస్ రూంలోకి డబ్బాలు పెట్టటానికి వచ్చేటప్పటికి టేబిల్ మీద తల పెట్టుకొని కూర్చుని వున్న రేణుక కనిపించింది. "కొంచం జరుగు. బాక్స్ డెస్కో్లో పెట్టాలి" కసురుకుంటున్నట్టు అన్న పూర్ణిమ మాటలకు తలఎత్తిన రేణుక కళ్ళల్లో నీళ్ళు చూసిన తరుణికి పాపం అనిపించి.

"హేయ్ ఎందుకు ఏడుస్తున్నావు? అన్నం తిన్నావా?" అంది.

ఆ మాటలు వినేటప్పటికి ఒక్కసారి భోరుమని ఏడ్చేసింది. ఆమె ఏడుపు చూసేటప్పటికి వాళ్ళకు జాలి అనిపించింది. ఇద్దరూ చెరొక పక్క కూర్చొని, "నీ పేరేంటి? రేణుకనా? ఎందుకు ఏడుస్తున్నావు? అన్నం తినలేదా? ఆకలేస్తోందా" అంటూ అడిగేటప్పటికి,

"నాకు భయమేస్తోంది. అందరూ కొత్తగా వున్నారు. నాతో ఎవరూ మాట్లాడటం లేదు. నాకు ఈ బడి నచ్చలేదు. రేపటినుండి నేను రాను." అని ఇంకా ఏడుపు ఎక్కువ చేసింది.

"అయ్యో భయమెందుకు? నువ్వు మా బెంచి మీద కూర్చున్నావుగా, ఈ రోజు నుండి మనం ముగ్గురం ఫ్రెండ్స్. సరేనా. అట్లా ఏడుస్తే అందరూ క్రై బేబీ అని బనాయిస్తారు. వూరుకో. అందరూ క్లాసులోకి వచ్చేలోపల కళ్ళు తుడుచుకో. అయినా నువ్వేమీ భయపడనక్కరలేదు. మనమందరమూ రేపటి నుండి కలిసే లంచ్ తిందాము. మాకు కూడా నువ్వు కొత్త కదా! అందుకనే నిన్ను లంచ్‌కి పిలవలేదు. ఇవాళ నువ్వు ఇక్కడే తినేసేయి. ఏదీ నీ బాక్స్ తీయి" అంది తరుణి అనునయిస్తూ.

పూర్ణిమ చనువుగా రేణుక బాగ్ లోంచి బాక్స్ తీసి ఓపెన్ చేసి "అరే, నీ బాక్స్‌లో రొట్టెలు వున్నయే. నాకు రొట్టెలంటే చాల ఇష్టం. మా ఇంట్లో చాల మందిమి వుంటాము కదా! అందరికి బాక్సుల్లోకి రొట్టెలు చేయాలంటే కష్టమని మా ఇంట్లో రొట్టెలే చేయరు. ఎప్పుడూ పెరుగన్నమే కలిపి పెడతారు తెలుసా. నువ్వు చాల లక్కీ. రేపటి నుండి మేము కూడా నీ బాక్స్‌లో రొట్టెలు షేర్ చేసుకుంటాము. అందుకని ఈ రోజుకు నువ్వు తినేసేయి. మేము పక్కనే కూర్చుంటాము." అంటూ ఇంటి వద్ద తన చిన్న చెల్లెళ్ళకు తమ్ముళ్ళకు నచ్చచెప్పి తినిపించే అలవాటు కొద్ది ముక్క తుంచి నోట్లో పెట్టి మొత్తం తినేలాగ చేసింది.

"ఇంక మనం ముగ్గురం ఒక జట్టు సరేనా, ఏదీ చేయి కలుపు" అంటూ చేయి చాచిన తరుణి చేతిలో పూర్ణిమ చేయిపెట్టగానే రేణుక తను కూడా చేయి కలిపింది.

ఆమె చాల అమాయకురాలు అని తెలుస్తోంది. ఎవరైనా గట్టిగా ఒక మాట అనగానే ఏడ్చేట్టు వుంది.

అది గమనించిన ఆకతాయి అమ్మాయిలు ఆమెను ఆట పట్టించబోయినారు. తరుణి పూర్ణిమ ఆమెకు బాడీ గార్డులలాగా అండగా నిలిచారు. ఆ విధంగా ఇద్దరికి ముగ్గురు తోడైనారు. మొదట్లో వాళ్ళ ముగ్గురి స్నేహం స్కూల్ వరకు మాత్రమే పరిమితమయింది.

ఒకసారి తరుణి పుట్టిన రోజు తప్పక రావాలని పట్టు పట్టేటప్పటికి రేణుక తండ్రి ఆమెను కార్లో స్వయంగా తీసుకొచ్చాడు. అక్కడ తరుణి పేరెంట్స్తో పాటు, పూర్ణిమ పేరెంట్స్ ను నాయనమ్మ జానకమ్మను కూడా కలిసాడు. వాళ్ళ ఫ్రెండ్లీ నేచర్ చూసాక ఆయన కూడా తరుచుగా భార్యా సమేతంగా వీళ్ళ ఇళ్ళకు రాకపోకలు సాగించసాగాడు.

రేణుక తండ్రి గవర్నమెంట్ డాక్టర్. ఆ సంవత్సరమే కర్నూల్ నుండి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చారు. హాస్పిటల్ తరువాత ప్రైవేట్ క్లినిక్ లో

ప్రాక్టీస్ చేసేవాడు. తన తరువాత కూతురుని డాక్టర్ చేసి తన ప్రాక్టీస్ మొత్తం ఆమె చేతిలో పెట్టాలన్న ఆశతో రేణుకను చిన్నప్పటి నుండే మెడిసిన్ చదవాలి అన్న విషయం మెంటల్‌గా నాటుకొనేలా చేసాడు.

ఆయన ఆశయానికి తగ్గట్టే రేణుక కూడా చదువులలో ఎప్పుడూ ముందే వుంటూ వచ్చింది.

"ఇప్పటి నుండే దానిమీద అంత ప్రెషర్ వేయటమేమిటండీ? దానికి నిండా పన్నెండేళ్ళు లేవు. పదవ క్లాస్ లో ఆప్షనల్స్ తీసుకొనేటప్పుడు చూడవచ్చు కదా. అప్పటికి దానికి ఏ సబ్జెక్ట్ మీద ఇంటరెస్ట్ వుంటే అదే చేస్తుంది. దాని ఇష్టాయిష్టాలేమిటో తెలుసుకోకుండానే మన అభిరుచులు దాని నెత్తిన రుద్దటం దేనికి?" అంటూ తల్లి రుసరుసలాడేది.

"నా అభిప్రాయం చెప్పటం, దానికి తగ్గ ఏర్పాటు చేయటం నా భాధ్యత. ఇట్లా చెప్పుతూ వుంటేనైనా దానికి సబ్జెక్ట్ మీద ఇంటరెస్ట్ కలుగుతుందన్న ఆశ. కాదూ కూడదూ, ఆ రోజున దానికి ఇష్టం కలగ లేదో నేనేమీ బలవంత పెట్టను. సరేనా?"

అడపాతడపా తండ్రితో క్లినిక్కు వెళ్ళే రేణుకకు కూడా చిన్నప్పటినుండి డాక్టర్ అవుదామన్న ఆశయమే ఏర్పడటంతో తల్లి భయపడ్డట్టుగా పెద్దగా సమస్యలేమీ రాలేదు.

పూర్ణిమకు నాయనమ్మ దగ్గర ప్రతిరోజూ కథలు వినటంతో పుస్తకాలు చదివే అభిరుచి చిన్నప్పటినుంచే కలిగింది. ఇంట్లో అమ్మ, పిన్నమ్మలు కూడా పుస్తక ప్రియులే. తండ్రి సీతారాముడు మంచి సాహిత్య ప్రియుడు.

ఆ రోజులలో శ్రీ కృష్ణదేవరాయల ఆంధ్ర భాషా నిలయమే సిటీ మొత్తానికి పేరున్న లైబ్రరీ. తండ్రి ఆ లైబ్రరీకి జన్మ సభ్యులు కావటంతో అక్కడ జరిగే సాహిత్య గోష్ఠులకు సాంస్కృతిక కార్యక్రమాలకు సీతారాముడుతో విధిగా వెళ్ళుతూండేది. ప్రతి వారం రకరకాల పుస్తకాలు లైబ్రరీ నుండి తేవటం అందరూ చదవటం అయిపోయిన తరువాత వేరే పుస్తకాలు తేవటంతో పూర్ణిమకు కూడా చిన్నతనం నుండే పఠనాసక్తి మెండుగా వుండేది. ఇంకా వార పత్రికలు చందమామ వంటి పిల్లల పత్రికలు కూడా ఇంట్లోనే కొనేవారు. అవి చదవటం చిన్న చెల్లెళ్ళకు తమ్ముళ్ళకు అందులోని కథలు చెప్పటం ఒక సరదాగా కూడా వుండేది.

అంతటితో ఆమెకు సాహిత్యపిపాస తీరలేదు. ఎనిమిదవ తరగతికొచ్చేటప్పటికి ఏ మాత్రం సమయం దొరికినా స్కూల్ లైబ్రరీలో కూర్చొని వివిధ పుస్తకాలు చదవటం అలవాటుగా మార్చుకున్నది. తరుణి రేణుకకు మొదట్లో అంత పుస్తకాల మీద ఇంటరెస్ట్ లేకపోయినా ఆమెతో పాటే లైబ్రరీకి వెళ్ళి ఏవో పత్రికలు తిరగేస్తూ కూర్చునే వారు.

తొమ్మిదో తరగతికి వచ్చేటప్పటికి అదొక వ్యసనంగా మారింది. ఏ రోజైనా లైబ్రరీకి వెళ్ళక పోతే ఏదో పోగొట్టుకున్న ఫీలింగ్.

"హేయ్ తరుణీ ఈ కథ చూడవే ఎంత బాగున్నదో. నిజంగా శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి కథలు తప్పకుండా చదవాలని మా నాన్నచెప్పుతూ వుంటారు. లైబ్రరీ సార్ను రోజూ అడుగుతూనే వున్నాను. ఎవరో టీచర్ తీసుకెళ్ళారని చెప్పుతూ వచ్చారు. మన అదృష్టం. ఇవాళ వాపసు వచ్చింది. ఈ కథ చదవండే ఎంత బాగుందో."

"ఏమిటే అంత ఇంటరెస్టింగ్ స్టోరీ." ఇద్దరూ వంగి పుస్తకంలోకి చూస్తూ అడిగారు.

"ఇది చెస్ గేంకు సంబంధించిన కథ. పేరు వడ్లగింజలు. నేను చెప్పేకన్నా పుస్తకంలోంచి చదివితేనే దానిలో అందం తెలుస్తుంది. మీరు కూడా చదవండి. దాని ముగింపు ఎంత బాగుంటుందో!" వూరిస్తునట్టు చెప్పింది.

"రోజూ లాగే నువ్వే చదవ్వే. మేము వింటాము."

"ఓసి పిచ్చి మొద్దుల్లారా! శ్రీపాదవారి కథలు ఎవరికి వారు చదివితే కలిగే అనుభూతి వేరు. కథ వింటే ఆ ఫీల్ రాదు. ఈ ఒక్కసారి చదువుతాను. తతిమ్మా కథలన్ని మీరే చదువుకోవాలి. తరువాత దాని గురించి డిస్కస్ చేయాలి." అంటూ బెదిరిస్తున్నట్టు వేలూపింది.

"సరేనమ్మా మహాతల్లి అట్లాగేలే. ఇప్పటికి నువ్వే చదువు."

పూర్ణిమ నెమ్మదిగా కథ చదవటం మొదలెట్టింది.

లైబ్రరీ పార్కు వీళ్ళ పఠనాసక్తి గురించి తెలుసు. కనుక అతను వీళ్ళకు మూలనున్న సీటు కేటాయించేవారు. ఇంకొకళ్ళకు ఏ విధమైన డిస్టర్బెన్స్ లేకుండా పూర్ణిమ చదవటం తతిమ్మా ఇద్దరు ఆనందించటం ఆయనకు తెలుసు. ఆ స్కూల్లో అంత ఇష్టంగా తెలుగు పుస్తకాలు చదివే వాళ్ళే కరువు. అటువంటిది నిజంగా చదివేవాళ్ళకు సహకారం ఎందుకు అందించకూడదు అన్న ఆలోచన తోనే ఆయన ఆ ఏర్పాటు చేసారు.

బహుశా ఆయనను చూసిన తరువాతే గామోసు పూర్ణిమకు లైబ్రేరియన్ అవుదామన్న ఆలోచన వచ్చినట్టున్నది. ఆ నాడు మనసులో నాటుకున్న ఆ చిన్న బీజమే భవిష్యత్తులో పెద్ద వృక్షమై ఆమె విజయానికి కారణమైందేమో!

కథ చదవటం పూర్తి చేసి తల ఎత్తేటప్పటికి లైబ్రరీలో పక్కగా ఇంకో డెస్క్ ముందర ఒక్కతే కూర్చొని వున్న కుసుమ కనిపించింది. కుసుమ ఆ సంవత్సరం అదే క్లాసులో చేరింది.

ఆ రోజు వుదయమే తెలుగు టీచర్ ఎవరితోటో చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. "పాపం ఆ అమ్మాయి తల్లి తండ్రులు కార్ ఏక్సిడెంట్లో చనిపోయారట. వాళ్ళ బాబాయి తమ దగ్గరకు తెచ్చుకొని పెంచుకుంటున్నారట. బోలెడంత ఆస్తి పరులు. అంతా ఆ అమ్మాయి పేరు మీదనే పెట్టారట. కాని ఏం లాభం. తల్లితండ్రులు ఇద్దరిని ఒకేసారి ఇంత చిన్న వయసులో పోగొట్టుకోవటం ఎంత దౌర్భాగ్యమో కదా!"

కుసుమ స్కూల్లో చేరి నెల రోజులు అవుతున్నది. ఆ సంవత్సరమే రెండు సెక్షన్ల స్టూడెంట్స్ ని ఒకే సెక్షన్ చేసేటప్పటికి ఇంకా అందరితో పరిచయాలు కాలేదు. అంచేత కుసుమ కూడా పక్క సెక్షన్ అమ్మాయనే అనుకున్నారు. పొద్దున మాటలు విన్నదాకా కొత్త ఎడ్మిషన్ అని తెలియలేదు.

కుసుమ తండ్రి వున్నతమైన కుటుంబానికి చెందిన వాడు. ఆస్తిపరులు. రకరకాల కార్లు కొనడం వాటి మీద లాంగ్ డ్రైవ్ వెళ్ళటం ఆయనకు హాబీ. ఒక కొడుకు ఒక కూతురు ఆయన సంతానం. బొంబాయిలో చాల విలాసవంతమైన జీవితం. అతని భార్య కూడా ఆ రోజులలోనే డిగ్రీ హోల్డర్. లైఫ్‌స్టైల్ కూడా దానికి తగ్గట్టే వుండేది. అదే వాళ్ళ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది.

ఎండాకాలం స్కూళ్ళకు సెలవులిచ్చారు. బొంబాయి వాతావరణం మహా వుబ్బరంగా వుంది. సామాన్యంగా ఏదైనా రెసార్ట్ కు వెళ్ళేవారు. అప్పుడే మార్కెట్ లోకి వచ్చిన కొత్త కారు ఇంటికి వచ్చింది. సెలెబ్రేట్ చేసుకుందామనుకున్నారు. అదే రోజు కుసుమ ఫ్రెండ్ బర్త్ డే పార్టీ వుండటాన ఆ అమ్మాయి సెలెబ్రేషన్స్ లో పాల్గొనలేకపోయింది.

తరువాత తల్లితండ్రులు వచ్చి పికప్ చేసుకుంటారని ఫ్రెండ్ ఇంట్లోనే వుండి పోయింది. కొత్త కారు కొన్న మోజులో భార్యను కొడుకును తీసుకొని తన వంటి మరికొంతమంది హై సొసైటీ ఫ్రెండ్స్‌తో పార్టీ అన్న పేరుతో గోవా బీచ్ కెళ్ళాడు.

ఆ లెవెల్ పార్టీ ఎట్లా వుంటుందో వూహించవచ్చు! పార్టీ మత్తులోనే ఫ్రెండ్స్ వద్దని వారిస్తున్నా వినకుండా కుసుమ ఒక్కతే వుండిపోతుందని కార్ డ్రైవ్ చేసుకుంటూ అర్ధరాత్రి బయలు దేరాడు. జరగకూడని అనర్థం జరిగిపోయి, అందరూ అక్కడికక్కడే మరణించారు.

కుసుమ తాతగారు, బామ్మగారు చిన్నకొడుకు వద్ద వుంటారు. కబురు వినగానే ఆయన కొడుకును తీసుకొని హుటాహుటిన బొంబాయి వెళ్ళారు. పాపం తల్లి తండ్రి అన్నను పోగొట్టుకున్న అభాగ్యురాలు ఇరుగుపొరుగు పోషణలో ఒంటరిగా వుండిపోయింది. ఏం జరిగిందో ఎవరూ చెప్పటం లేదు. ఏమీ అర్థం కావటల్లేదు. డెడ్ బాడీస్ హాస్పిటల్ లోనే వుంచారు.

తాతగారు చిన్నాన్నా వచ్చి ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి మనుమరాలిని తీసుకొని విమానంలో హైద్రాబాదు బయలుదేరారు.

"తాతగారూ అమ్మ నాన్న అన్న ఏరి?" అన్న ప్రశ్నకు ఎవరూ సరైన సమాధానం చెప్పకుండా దుఃఖాన్ని దిగమింగుకుంటూ ఏదో

చెప్పేస్తూ దాటేసారు.

ఇల్లు చేరిన తరువాత బామ్మగారు "అయ్యో నా తల్లీ ఒక్కసారి తల్లి తండ్రులను పోగొట్టుకొని అనాధవైపోయినావా!" అంటూ ఒక్కసారి భోరుమనేటప్పటికి అసలైన మృత్యువాతావరణం చోటు చేసుకున్నది. బంధువులందరు ఒకరొకరుగా రావటం ఏడవటమేకాక కుసుమ అనాథ అయిందని సానుభూతి తెలపటం, ఈ ప్రహసనం నెలరోజులు జరగటంతో, కుసుమ తను అనాధనని లోకంలో ఎవరు లేరని వున్న వారందరూ బంధువులే కాని నా అన్న వారు కారన్న భావన మనసులో నాటుకు పోయింది. దానికి తోడు చిన్నాన్న పిల్లలు మాటిమాటికి తనున్న గదిలోకి తొంగి చూస్తూ దూరం దూరంగా వెళ్ళటం. వీటన్నిటితో ఆమె ఒక ఇన్ట్రావర్ట్ గా మారిపోయింది.

ఆ ఫీలింగ్ నుండి బయటకు తేవటానికి కుటుంబ సభ్యులు ఎంతగానో ప్రయత్నించారు. కాని సాధ్యం కాలేదు. ఈ లోపల ఎండాకాలం సెలవులు ముగియటం స్కూళ్ళు తెరవటం జరిగింది. కుసుమ చిన్నాన్న చాల ఆలోచించాడు. ఆమె బొంబాయిలో చదువుకున్నది. తెలుగు మాట్లాడటమే కాని రాయటం చదవటం అంతబాగా రాదు.

అందుచేత ఏ స్కూల్లో చేర్చాలన్నాఅదొక సమస్య అయి కూర్చున్నది.

ఈ స్కూల్ మానేజిమెంట్ మెంబర్ ఆయనకు పరిచితుడు. ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడి ఇంటి వద్ద ట్యూషన్ పెట్టి తెలుగు నేర్పించేందుకు ఏర్పాటు చేసేటట్టు అప్పటికి కూడా అందుకోలేకపోతే అప్పుడు వేరే ఏర్పాటు చూద్దాము అన్న ఒప్పందం మీద ఎడ్మిషన్ ఇప్పించారు.

అసలే డిప్రెషన్ లో వున్న కుసుమ ఈ తెలుగు సబ్జెక్ట్ మూలకంగా ఇంకా లోలోపలికి కుంచించుకు పోసాగింది.

ఆమెను చూడగానే పూర్ణిమ లేచి దగ్గరకు వెళ్ళి, "హాయ్ నీ పేరు కుసుమ కదా! మేము కూడా మీ క్లాసే నాపేరు పూర్ణిమ." అని ఆమె చదువుతున్న పుస్తకంలోకి తొంగి చూసింది. అది చిన్నచిన్న పదాలు మాటలు వున్న తెలుగువాచకం. "ఇదేంటీ చిన్న క్లాసుల పుస్తకం చదువుతున్నావు?" ఆశ్చర్యంగా అడిగింది.

"నేను బొంబాయి నుండి వచ్చాను. నాకు తెలుగు చదవటం రాయటం బాగా రాదు. క్వార్టర్లీ ఎగ్జాంస్ లోగా చదవటం రాయటం రాకపోతే ఎడ్మిషన్ కాన్సిల్ అయిపోతుంది. ఇంటి వద్ద మాతాతగారు ట్యూషన్ మాష్టరు నేర్పిస్తున్నారు. నేనుకూడా ఫ్రీ టైం దొరికినప్పుడల్లా ప్రాక్టీస్ చేస్తూ వున్నాను."

ఆ మాటలు విన్న పూర్ణిమకు ఇంకా జాలి ఎక్కువయింది.

"ఒక్కదానివే ఎందుకు? మేము కూడా నీకు హెల్ప్ చేస్తాము. రా. ఇంకా ఇద్దరు మన క్లాస్‌మేట్స్ అక్కడ కూర్చున్నారు పరిచయం చేస్తాను." అంటూ చేయి పట్టుకొని తీసుకెళ్ళింది. ఒకరినొకరికి పరిచయం చేసింది.

చాల మొహమాటంగా వాళ్ళు ముగ్గురు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పింది. సాధ్యమైనంత వరకు పర్సనల్ విషయాలు అడగకుండా జాగ్రత్త పడ్డారు ముగ్గురు కూడా. ఆ పాటికే కుసుమ తాతగారి ప్రయత్నం వల్లనేకాని స్వయం కృషి పట్టుదల వల్లనే కాని అక్షరాలు గుణింతాలు నేర్చేసుకుంది. ఇంకా బాగా వత్తులు ప్రాక్టీసు కావలసి వుంది.

ఆ సంగతి తెలిసిన పూర్ణిమ, "నువ్వు వూరికే అట్లా వాచకం చదివే కన్నా, ఇదిగో ఈ చందమామ కథలు చదవటం అలవాటు చేసుకో. ఇంకా తొందరగా వస్తుంది." అని సలహా ఇచ్చి, "మేము రోజూ లైబ్రరీలో ఇక్కడే కూర్చొని చదువుకుంటూ వుంటాము. నువ్వు కూడా మాతో జాయిన్ అవు. నీకేమైనా అర్థం కాని పదాలుంటే మేము సహాయం చేస్తాము." అంటూ ధైర్యం చెప్పింది.

(కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments